క్లుప్తంగా

శ్రీరామ్మూర్తికి 'అంబేడ్కర్' జాతీయ అవార్డు



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని అలుగుమల్లెపాడుకి చెందిన మారం శ్రీరామ్మూర్తికి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జాతీయ అవార్డుని ప్రకటించారు. 30 ఏళ్లుగా విద్యా రంగంలో శ్రీరామ్మూర్తి మాస్టర్ సేవలను ప్రైవేట్ లెక్చరల్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ గుర్తించింది. దీంతో ఆయనకు ఈ అవార్డుని ప్రకటించింది. ఏప్రిల్ 13న గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే వేడుకల్లో ఈ అవార్డుని శ్రీరామ్మూర్తికి అందజేయనున్నారు. ఉపాధ్యాయులు పాలిశెట్టి అప్పారావు, రాయల శ్రీధర్ అభినందనలు తెలిపారు.

చదరంగంతో మేథా శక్తి పెంపు

మాచర్ల: చెస్ క్రీడా పోటీల వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి, చురుకుదనంతో మెదడుకు పదును పెట్టవచ్చని చక్రధర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో పల్నాడు చెస్ అకాడమి కోచ్ కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్రి అంజలి, అధ్యాపకులు ఆవుల ఆంజనేయులు, కళాశాల డైరెక్టర్ మహేష్‌రెడ్డి, అధ్యాపకురాలు ఎస్.కవిత తదితరులున్నారు. చెస్ పోటీలో విజయం సాధించిన వారికి అభినందనలు తెలిపారు.

మహా సరస్వతీ అమ్మవారికి విశేష పుష్పాలంకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవాలయంలో దేవి వసంత నవరాత్రుల సందర్భంగా సోమవారం మహా సరస్వతి అమ్మవారికి విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. అలాగే వసంత నవరాత్రులు రెండవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారులు అందించారు.

పేరంటాలమ్మ తిరునాళ్ల ఆదాయం రూ.6 లక్షలు

శావల్యాపురం: మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలోని అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి ఆలయ తిరునాళ్ల సందర్భంగా దేవాలయానికి ఆదాయం రూ.6 లక్షల 37 వేల 158 వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. బహిరంగ వేలం ద్వారా రూ.లక్ష 36 వేల 500, భక్తులు విరాళాల రూపంలో ఇచ్చిన నగదు రూ.2 లక్షల 90 వేల 741, హుండీ కానుకల ఆదాయం రూ.ఒక లక్ష 91 వేల 587, చీరలు వేలంలో రూ.18 వేల 330 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి అదనంగా ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అధికారులు హనుమంతరావు పి.వెంకటరెడ్డి, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పురాతన ఇత్తడి సామగ్రి చోరీ

పెదకూరపాడు: ఖాళీగా ఉంటున్న ఇంట్లో పురాతన ఇతడి సామగ్రి చోరీకి గురైన సంఘటన మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 75త్యాళ్ళూరుకు చెందిన సూరెపల్లి లక్ష్మీ నరసింహారావు ఉద్యోగరీత్యా గుంటూరులో గత పదేళ్లుగా నివాసం ఉంటున్నారు. 75త్యాళ్ళూరులో ఉన్న సొంత ఇంటికి అప్పుడప్పుడు వస్తారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నరసింహారావు, అతని భార్య నాగలక్ష్మి ఇంటికి రాగా, తాళాలు తెరిచి ఉండటం చూసి ఇంటిలోని సామగ్రిని పరిశీలించగా, పురాతన ఇత్తడి సామగ్రి కనిపించకపోవడంతో చుట్టపక్కల వారిని ఆరా తీశారు. వారు మాకు తెలియదని చెప్పడంతో పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

యువకుడికి దేహశుద్ధి..

సత్తెనపల్లి: యువకుడికి దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామానికి చెందిన ఓ యువకుడు సత్తెనపల్లిలోని క్రిస్టియన్ పేటలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టేందుకు కొద్ది రోజులుగా వస్తున్నాడు. ఈ క్రమంలో క్రిస్టియన్ పేటకు చెందిన ఓ వికలాంగురాలితో పరిచయం పెంచుకొని ఆమెపై లైంగికదాడి చేసినట్లు సమాచారం. విషయం ఆమె పెద్దలకు తెలపడంతో వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేసిన క్రమంలో యువకుడు అడ్డం తిరగాడు. దీంతో దేహశుద్ధి చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



విజయపురిసౌత్ ఈద్గాలో సందేశమిస్తున్న హాఫీజ్ సాబ్ సల్మాన్ రషీద్



గురజాల: ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



కారెంపూడిలో నమాజు చేస్తున్న ముస్లింలు



తుమ్మకోట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు

విజయపురిసౌత్: రంజాన్ పర్వదిన వేడుకలను విజయపురిసౌత్‌లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు(హాఫీజ్ సాబ్) ఇమామ్ సల్మాన్ రషీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలంతా సోదరభావంతో శాంతియుతంగా మెలగాలని సూచించారు. స్థానిక మసీదు అధ్యక్షుడు రహంతుల్లా, మౌజన్ ఎస్కే ఖాసీం, కన్వీనర్ ఎస్కే మస్తాన్, రిటైర్డ్ ఫోర్‌మెన్ ఎస్కే మస్తాన్‌వలి, షరీఫ్ తదితరులున్నారు.

దాచేపల్లి : రంజాన్ పండుగ వేడుకలు మండల వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జామియా, మర్కస్, మజీద్‌ఏ మహ్మదీయ మసీదుల్లో ప్రత్యేకంగా నమాజ్‌లు జరిగాయి. దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రాంగణంలోని ఈద్గా వద్దకు భారీ ఎత్తున ముస్లింలు చేరుకుని నమాజ్ చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

గురజాల : రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకున్నారు. పెద్ద మసీదు నుంచి అల్లా హు అక్బర్ అంటూ పఠిస్తూ లక్ష్మీ టాకీస్ సెంటర్‌లోని ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బిల్లును వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జిలు ధరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాసేలా కేంద్రం ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరంగా ఉందని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు.

మాచర్ల: రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 26వ వార్డులోని యాదవుల బజారు ప్రాంతంలోని ఈద్గాలో ముఫ్తీ షేక్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒకరినొకరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాకు చేరుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముస్లింలతో కలసి రంజాన్ ప్రార్థనలు చేశారు. అనంతరం ఈద్గా, మసీదు అభివృద్ధికి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు.

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత పెద్దలు రంజాన్ సందేశాన్ని ప్రబోధించారు.

కారెంపూడి: రంజాన్ పండుగ వేడుకలు మండలంలోని వివిధ గ్రామాలలో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉపవాస దీక్షలు ముగించుకుని ఈదుల్ ఫితర్ వేడుకలు చేసుకున్నారు. స్థానిక దాచేపల్లి వెళ్లే రోడ్డులో, అలాగే వినుకొండ వెళ్లే రోడ్డులోని ఆదినారాయణ కాలనీలో ఉన్న ఈద్గాల వద్దకు ముస్లింలు భారీగా చేరుకుని ఉమ్మడిగా నమాజులో పాల్గొన్నారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. ఒప్పిచర్లలో జరిగిన రంజాన్ వేడుకలలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తనయుడు గౌతమ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతల: ప్రపంచ శాంతిని..మత సామరస్యాన్ని చాటే పవిత్ర దినమే రంజాన్ అని ముస్లిం మత గురువు మహమ్మద్ షఫీ అన్నారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రేగుల మాణ్యం కాలనీలోని ఈద్గాలో ఆయన రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. మానవాళికి జీవన విధానం తెలిపే పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిన నెల రంజాన్ మాసం అన్నారు. ఆధ్యాత్మిక భావంతో జీవిస్తున్నప్పుడే వ్యక్తులలోని కామ, క్రోదాలు వంటి చెడులక్షణాలు దూరమవుతాయన్నారు. స్థానిక ముస్లింలు ర్యాలీగా రేగులమాన్యం కాలనీలోని ఈద్గాకు వెళ్లి అల్లాకృప కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలలో జామియా చైర్మన్ తండాసైదా, మజీద్, నూర్ మజీద్, బిలాల్ మజీద్ కమిటీల పెద్దలు చాంద్ బాబు, దస్తగిరి, షేక్ ఇమాంస, ఐస్‌క్రీమ్ బుజ్జి, పలువురు మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



మాచర్లలో రంజాన్ ప్రార్థన చేస్తున్న ముస్లింలు



తురకపాలెంలో ఈద్గా వద్ద ప్రార్థనలో..



పిడుగురాళ్ల చెరువు కట్ట వద్ద ఈద్గాలో నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల: ముస్లిం సోదరులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న ఈద్గా వద్దకు నమాజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

అక్కినేని అనిల్‌కు ఉగాది పురస్కారం



మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో సత్యసాయి విద్యా విహార్ పాఠశాల స్థాపించి, నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లీషు మీడియం బోధన అందిస్తున్న అక్కినేని అనిల్ కుమార్ సేవలు అమూల్యమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.మన్మథరావు అన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన దీపం ఉగాది పురస్కారాల సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట కృషిని సాధిస్తున్న అవార్డులందజేస్తూ ఆయన మాట్లాడారు. ఆర్థికంగా, విద్యా పరంగా వెనుకబాటు తనం ఎదుర్కొంటున్న మాచర్లలో ఉచితంగా ఇంగ్లీషు మీడియం విద్యనందిస్తున్న సత్యసాయి విద్యా విహార్ సేవలు ఎనలేనివన్నారు. వీటి నిర్వాహణలో అనిల్ చూపిస్తున్న ప్రత్యేక కృషిని కొనియాడారు. దీపం విశ్వావసు నామ పురస్కారాలకు విద్యా రంగం, భారతీయ సంస్కృతి, విశిష్ట కృషి చేస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహితి అకాడమి పురస్కార గ్రహీత పి.లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ గోగరాజు గంగరాజు, జీఆర్కే పోలవరపు, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. టంగుటూరి వెంకట సుబ్బారావు చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు శ్రీనివాసరావు, సతీష్ మినరల్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు వేసవి సమయంలో దాహార్తి తీర్చేందుకు డిపో మేనేజర్ కోటేశ్వరరావు సూచనల మేరకు దీనిని ప్రారంభించినట్లు వారు తెలిపారు.

శాంతిమార్గమే ఖురాన్ బోధన



పిడుగురాళ్ల మసీద్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

పిడుగురాళ్ల: శాంతి మార్గమే ఖురాన్ బోధిస్తుందని అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ తెలిపారు.. పట్టణంలోని పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న ఈద్గాలో రంజాన్ పండగ సందర్భంగా సోమవారం ముస్లీం సోదరులు నమాజ్ చదివారు. ముందుగా ఉస్మాన్ మేస్త్రీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులందరు కలిసి అల్లాను స్మరిస్తూ జానపాడు రోడ్డులోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. నమాజ్ చదివారు. అనంతరం హిమామ్ సాహెబ్‌కు రంజాన్ శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం ముస్లింలందరూ ఒకరిని ఒకరు అలింగనం చేసుకొని రంజాన్ శుభకాంక్షలు తెలుపుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని మసీద్‌వద్ద ముస్లింలు ఈద్గా వద్ద నమాజ్‌కు వెళ్లే ముందు ఈ వక్ఫ్‌బోర్డు ఆస్తుల సరవణ బిల్లు వెనక్కి తీసుకోవాలంటూ నిరసన తెలిపారు. జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎండీ జబ్బార్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు యూసుబ్ జాని, అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ ఎండీ రషీద్, ముఫ్తీ అబ్దుల్ ఖాదర్, ఆఫీజ్ అబ్దుల్ ఖాదర్, ఖిద్మత్ టౌన్ కమిటీ అధ్యక్షులు ఎండీ బాబర్, పట్టణ మైనార్టీ కౌన్సిలర్లు షేక్ అబ్దుల్లా, సైదావలి, కరిముల్లా, మైనార్టీ సోదరులు జానీబాబు, బాషా, ఎండీ లతీఫ్, ఖయ్యూం, సిద్దిక్, అప్జికల్ జానిబాషా, ఎండీ అలీం, మజీద్, కరీం, రహీం తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు

పేదలకు దుస్తులు పంపిణీ



మాచవరం: రంజాన్ సందర్భంగా మాచవరం గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్ ఆధ్వర్యంలో మహిళలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన మాచవరంలోని సర్పంచ్ రాగిడి నరేష్ గృహం వద్ద మహిళలకు, వృద్ధులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ హాజరయ్యారు.

అనంతరం ముస్లిం నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను సన్మానించి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మహ్మద్ జాని, డీడీసీ మాజీ అధ్యక్షులు వెలిశల అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పెదమాబు, చిన మాబు, షేక్ మస్తాన్‌వలి, నేలటూరి సాగర్, చిటిమాల మహేష్, మణికంఠ, రామకృష్ణ, సయ్యద్ జాని, షేక్ జాని, ఎస్సీ కాలనీ యూత్, ముస్లీం యూత్ నాయకులు పాల్గొన్నారు.

పేదలను విమర్శిస్తే ఏమొస్తుంది..

మాచర్ల : రాష్ట్రంలో వెనుకబడిన బీసీ, ఎస్సీ, మైనార్టీలు సోమరిపోతులని, మీటింగ్‌లకు వచ్చి వెళ్లిపోతారని మాట్లాడి బడుగు, బలహీన వర్గాలను సీఎం చంద్రబాబు అవమానించటం బాధాకరమని ఉమ్మడి జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు నూన్సావత్ రంగానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని విలేకరులతో మాట్లాడారు. పీ4 పథకం కింద పేద ప్రజలను ధనవంతులను చేయడానికి పిలిచి ఎండకు తట్టుకోలేక పలువురు వెళ్లిపోయారన్నారు. తన మీటింగ్ వినలేదని కోపంతో బడుగు, బలహీన వర్గాలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేయడం దురదృష్టకరమన్నారు. ఉదయం వచ్చిన ప్రజలు ఆకలి తట్టుకోలేక మంచినీటికి కూడా ఇబ్బంది పడుతూ ఎండ ప్రభావంతో కొంతదూరం వెళ్లగానే మీరు అభివృద్ధి చెందరని మాట్లాడడం సమంజం కాదన్నారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఊరే మధు

విజయపురిసౌత్: స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీలను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఊరే మార్క్ ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో సోమవారం ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు ఊరే మధు విజయపురి సౌత్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బొంత అరుణ్ కుమార్, ఎంఎస్పీ అధ్యక్షుడిగా మీసాల దానియేలు, ఉపాధ్యక్షుడిగా సిద్దెల దానియేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాచర్ల ఇన్‌చార్జ్ గడ్డిపర్తి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్, ఎంఎస్పీ మాచర్ల అధ్యక్షుడు గ్యార చిన్న మల్లయ్య పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

పశ్చిమ సినడ్ బిషప్‌గా చాట్ల ఐజయ్య

మాచర్ల : పట్టణంలోని అంబేడ్కర్ పార్కు సమీపంలో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ చర్చి పాస్టర్ చాట్ల ఐజయ్య రాజును రెండవ సారి 2025 – 2030 వరకు పశ్చిమ సినడ్ బిషప్‌గా ఎంపిక చేసినట్లు ఆంధ్రా ఇవాంజిలికల్ గుంటూరు ఉమ్మడి జిల్లా మోడరేట్ బిషప్ చింతల ఏలయ్య సోమవారం ప్రకటించారు. ఆయన మాచర్లలో పర్యటించి ఉపవాస ప్రార్థనలు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంఘ పెద్దలతో సమావేశమై గతంలో పశ్చిమ సినడ్ బిషప్‌గా ఉన్న చాట్ల ఐజయ్యను రెండవ సారి ఐదు కొనసాగేలా ఏకాభిప్రాయంతో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ సినడ్‌లో ఆయా చర్చిల అభివృద్ధిలో ఏఈఎల్‌సీలో ఆయన తరపున ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి అందులో భాగంగానే ఐజయ్యను రెండవ సారి బిషప్‌గా ఎంపిక చేసినట్లు మోడరేట్ బిషప్ చింతా ఐలయ్య పేర్కొన్నారు. ఈ ఎంపిక సమావేశంలో చర్చి సంఘ పెద్దలు పశ్చిమ సినడ్ పరిధిలోని చర్చి సంఘ పెద్దలు పలువురు పాల్గొన్నారు. అనంతరం ఐజయ్యను పలువురు అభినందించారు.



చాట్ల ఐజయ్య రాజుకు సత్కారం

మహిళా ఉద్యమానికే 'ఉదయం' స్ఫూర్తిదాయకం

ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ


సత్తెనపల్లి: కామ్రేడ్ మోటూరు ఉదయం మహిళా ఉద్యమానికి స్ఫూర్తి దాయకమని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన మోటూరు ఉదయం వర్థంతి సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సభకు ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని అధ్యక్షత వహించారు. ఉమాశ్రీ మాట్లాడుతూ కామ్రేడ్ మోటూరు ఉదయం స్త్రీ జనోద్ధరణకు ఎంతగానో కృషి చేశారన్నారు. బుర్రకథ ఆమె ఉద్యమానికి ప్రధాన ఆయుధంగా ఉండేదన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని 1970–80ల్లో ఎందరో సినీ దర్శకులు శక్తివంతమైన మహిళల పాత్రలను సృష్టించారన్నారు. తొలుత ఉదయం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా నాయకులు ధరణికోట విమల ,తుమ్మల లక్ష్మి, కట్ట రమాదేవి, ఇంజం అరుణ, కె.సుధ, మునగా భారతి, స్పందన, సాయి, బిందు, ప్రజాసంఘాల నాయకులు కె.శివ దుర్గారావు, చందా ఆంజనేయులు, షేక్ మస్తాన్‌వలీ పాల్గొన్నారు.



మోటూరు ఉదయం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు తదితరులు

రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం

బెల్లంకొండ: మండలంలోని కందిపాడు గ్రామంలో వేంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్థానిక ఎస్ఐ డి.ప్రవీణ్, మండల టీడీపీ నాయకులు ప్రారంభించారు. మొదటి రోజు పోటీలలో భాగంగా సీనియర్, ఆరు పళ్ల సైజు ఎడ్లకు పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరు పళ్ల సైజు గిత్తలు ఆరు జతలు పోటీలలో పాల్గొనేందుకు వచ్చాయన్నారు. బుధవారం నాలుగు పళ్ల, జూనియర్, సేద్యం విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ ప్రవీణ్, నాయకులు

రూ.50 లక్షలతో దేవాలయ పునర్నిర్మాణం

శావల్యాపురం: వేల్పూరులో రూ.50 లక్షలతో గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ముంద్రు రాఘవరావు సోమవారం తెలిపారు. గ్రామస్తులు, దాతలు సహకారంతో దేవాలయ నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. తిరుమల–తిరుపతి దేవస్థానం రూ.10 లక్షలు సహకారం అందించినట్లు వివరించారు. ఈ నెల 21 నుంచి దేవాలయ ప్రతిష్ఠా కార్యక్రమం ప్రారంభమై.. 23న గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరుగుతుందని వివరించారు.

వైభవంగా రెడ్డి పేరంటాలమ్మ ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలోని రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన ఆలయ వార్షికోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు వేకువజాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడు లు తీర్చుకున్నారు. ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలువురు దాతలు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాత్రి భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు.

మరో రెండు చోట్ల పాట కచేరీ నిర్వహించారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరటంతో రూ.2 కోట్ల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించిన విషయం విదితమే. మార్చి 17న పునః ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఆలయ వాస్తు సిద్ధాంతి నెమ్మికంటి నరసయ్యాచారి, ఆలయ రాతి నిర్మాణ రూపకర్త సుబ్రహ్మణ్యాచారి, గోపుర శిల్ప కళాకారుడు పులకల లక్ష్మణను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం బంగారు ఉంగరాలు, నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, సభ్యులు జంపని లక్ష్మీనారాయణ, చెన్నుబోయిన వెంకట సుబ్బారావు, తమ్మ సీతయ్య, వజ్జా రామారావు, నర్రా శ్రీనివాసరావు, వజ్జా వెంకటరావు, గొర్రె సాంబశివరావు పాల్గొన్నారు.



ఆలయంలో సన్మాన గ్రహీతలతో కమిటీ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పెదకూరపాడులో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షేక్ జానీ రంజాన్ ప్రార్థనలు ముగించుకోని పెరుగు ప్యాకెట్ తీసుకునేందుకు ఇంటి నుంచి కాలచక్ర రహదారిలోని దుకాణానికి వెళ్తున్న సమయంలో చిన్నమక్కెన గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి పూటుగా మద్యం సేవించి షేక్ జానీని బలంగా ఢీకొనడంతో జానీ తల వెనుక భాగం, తొంటి, కాలు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స కోసం 108 వాహనంలో పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మద్యం సేవించి వాహనం నడిపిన భాస్కర్‌రెడ్డికి కూడా గాయాలయ్యాయి.



తీవ్రంగా గాయపడిన షేక్ జానీ